సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా
గురువారం । 10 । ఆగస్టు । 2023



పౌర సేవలకు ప్రాధాన్యం

గ్రామ సచివాలయ సిబ్బంది విధులకు సక్ర మంగా హాజరై పౌరసేవలు అందించాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశించారు. 8లో



నామినేషన్ల బోణీ

జిల్లాలో ఖాళీగా ఉన్న సర్పంచ్, వార్డు సభ్యుల స్థానాల ఎన్నికలకు నామినేషన్ల స్వీకరణ ప్రారంభమైంది. 8లో



వెదురు కంజి భలే రుచి

మన్యం ప్రజలు వెదురు కొమ్ములు, వెదురు చిగుళ్లతో తయారుచేసే వంటకాలు ఎంతో రుచిగా ఉంటాయి. 8లో

న్యూస్‌రీల్

19న సర్పంచ్‌లు, వార్డు సభ్యుల స్థానాలకు ఎన్నిక

- కలెక్టర్ సుమిత్‌కుమార్ వెల్లడి

పాడేరు రూరల్ : జిల్లాలో ఖాళీగా ఉన్న నాలుగు సర్పంచ్, 66 వార్డు స్థానాలకు ఈనెల 19న ఎన్నికలు నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ సుమిత్ కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు ఈనెల 8న నోటిఫికేషన్ జారీ అయిందన్నారు. అర్హత, ఆసక్తి గల అభ్యర్థులు ఈనెల 10వ తేదీ వరకు ప్రతిరోజు ఉదయం 10.30 నుంచి సాయంత్రం 5గంటల వరకు నామినేషన్ దాఖలు చేసుకోవచ్చన్నారు. 11న నామినేషన్ల పరిశీలన, 12 సాయంత్రం 5 గంటల వరకు తిరస్కరణకు గురైన అభ్యర్థులు అప్పీల్ చేసుకోవచ్చున్నారు. 14న మధ్యాహ్నం 3 గంటల లోపు నామినేషన్లు ఉప సంహరించుకోవచ్చన్నారు. అనంతరం తుది జాబితా ప్రకటిస్తామన్నారు. 19న ఉదయం 7గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పోలింగ్ జరుగుతుందన్నారు. అదేరోజు మధ్యాహ్నం రెండు గంటల నుంచి లెక్కింపు ప్రారంభించి ఫలితాలు ప్రకటిస్తామని తెలిపారు. అవసరమైన చోట 20వ తేదీన రీపోలింగ్ నిర్వహిస్తామని కలెక్టర్ పేర్కొన్నారు.

ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీలో ఇద్దరు నియామకం

- ఆర్డర్లు అందజేసిన కలెక్టర్ సుమిత్‌కుమార్



పాడేరు రూరల్ : ఆంధ్రప్రదేశ్ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీలో ఇద్దరు ఉద్యోగులను నియమిస్తూ కలెక్టర్ సుమిత్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈమేరకు బుధవారం నియామక ఉత్తర్వులను అందజేశారు. క్లస్టర్ మేనేజర్ పోస్టుకు 15 మంది, డేటా మానిటరింగ్ డాక్యుమెంటేషన్ ఆఫీసర్ పోస్టుకు 12 మంది దరఖాస్తు చేసుకున్నారు. వీరిని డీఎస్సీ ద్వారా ఎంపిక చేశారు. వీరిలో పి. సునీతకు క్లస్టర్ మేనేజర్, సొనారి చిరంజీవిను డీఎండీవోగా నియమించారు. వీరికి బుధవారం ఐటీడీఏ కార్యాలయంలో కలెక్టర్ సుమిత్‌కుమార్ నియామక పత్రాలు అందజేశారు. ఎంపికైన ఉద్యోగులు జిల్లా క్షయ నివారణ విభాగంలో పనిచేయాలని సూచించారు. డీఎంహెచ్‌వో డాక్టర్ జమాల్‌బాషా, జిల్లా క్షయ నివారణాధికారి డాక్టర్ టి. విశ్వేశ్వరనాయుడు పాల్గొన్నారు.

ఆదివాసీల పాత్ర కీలకం



మాట్లాడుతున్న రుద్రరాజు

అరకులోయ టౌన్: స్వాతంత్ర్య పోరాటంలో ఆదివాసీల పాత్ర ఎంతో కీలకమని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు గిడుగు రుద్రరాజు అన్నారు. కాంగ్రెస్ రాష్ట్ర కమిటీ ఎస్టీ విభాగం చైర్‌పర్సన్ పాచిపెంట శాంతకుమారి ఆధ్వర్యంలో బుధవారం ఓ ప్రైవేట్ హోటల్‌లో ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర్య పోరాటంలో అల్లూరి సీతారామరాజు, మల్లుదొర, గంటందొర ప్రత్యేక పాత్ర పోషించారన్నారు. ఏపీసీసీ కార్యదర్శి మియ్యప్పాస్, ఏపీసీసీ సభ్యురాలు అమర్ జహామస్తన్ బేగం, ఏపీసీసీ ఎస్సీ కమిషన్ చైర్‌పర్సన్, మాజీ ఎమ్మెల్యే కమలమ్మ తదితరులు పాల్గొన్నారు.

భార్యపై కత్తితో దాడి

తీవ్రంగా గాయపడటంతో విశాఖ కేజీహెచ్‌కు తరలింపు

హుకుంపేట: భర్త దాడిలో తీవ్రంగా గాయపడిన భార్య పరిస్థితి విషమంగా ఉంది. ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఈ ఘటన వివరాలిలా ఉన్నాయి.

మండలంలోని మారుమూల పట్టం పంచాయతీ డాబవలస గ్రామానికి చెందిన కిల్లో గాసన్న, భార్య బృంద మధ్య గత శనివారం రాత్రి గొడవ జరిగింది. దీంతో ఆమె అదే గ్రామంలోని అత్తమామల ఇంటికి పడుకునేందుకు వెళ్లింది. వెంటనే భర్త గాసన్న కూడా అక్కడికి వెళ్లాడు. మళ్లీ అక్కడ భార్యతో గొడవపడ్డాడు. కత్తితో ఆమెపై దాడి చేయడంతో తీవ్రంగా పడింది. రక్తపు మడుగులో ఉన్న ఆమెను 108లో పాడేరు ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఆమె పరిస్థితి విషమంగా ఉండడంతో పాడేరు వైద్య సిబ్బంది విశాఖ కేజీహెచ్‌కు తరలించి చికిత్స అందిస్తున్నారు. ఈ విషయం తెలుసుకున్న ఎస్‌ఐ సతీష్ బుధవారం గ్రామానికి వెళ్లి వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఆయన పేర్కొన్నారు.



వ్యవసాయ పరికరాల లబ్ధిదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్‌కుమార్, ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి, ఐటీడీఏ పీవో అభిషేక్



పాడేరులో ఆకట్టుకున్న సాంస్కృతిక ప్రదర్శన



రంపచోడవరంలో వేడుకలను ప్రారంభిస్తున్న గిరిజన పెద్దలతో ఎమ్మెల్యే ధనలక్ష్మి

సమగ్ర గిరిజనాభివృద్ధే లక్ష్యం

- అడవితోపాటు గిరిజనుల భూములకు రక్షణ
- హక్కులు, చట్టాలను కాపాడుదాం
- కలెక్టర్ సుమిత్‌కుమార్
- ఘనంగా ప్రపంచ ఆదివాసీ దినోత్సవం
- ఆకట్టుకున్న విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు
- గిరిజన పెద్దలకు ఘనంగా సన్మానం
- లబ్ధిదారులకు వ్యవసాయ యాంత్రీకరణ పరికరాల పంపిణీ



పాడేరులో ఆదివాసీ దినోత్సవంలో మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

పాడేరు రూరల్ : జిల్లాలో సమగ్ర గిరిజనాభివృద్ధే అధికారుల లక్ష్యం కావాలని, గిరిజనాభివృద్ధికి ప్రతీ అధికారి అవినీతి రహితంగా చిత్తశుద్ధితో పనిచేయాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ పిలుపునిచ్చారు. ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి అధ్యక్షతన బుధవారం పట్టణంలోని ఓ ప్రైవేట్ కల్యాణ మండపంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన కలెక్టర్ మాట్లాడుతూ ఆదివాసీలు ఆధారపడిన అడవి పరిరక్షణతోపాటు గిరిజన హక్కులు, చట్టాలను కాపాడుతున్నామన్నారు. రానున్న 50 రోజుల్లో సమగ్ర గిరిజనాభివృద్ధికి చర్యలు చేపడుతామన్నారు. నేనుసైతం జై ఆదివాసీ అంటూ నినదించారు.

ఆదివాసీల పాత్ర ఎనలేనిది: ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి

అడవులను సంరక్షించడంలో ఆదివాసీలు ఎంతో కృషి చేస్తూ ప్రపంచానికి ఆక్సిజన్ అందిస్తున్నారని పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి పేర్కొన్నారు. స్వాతంత్ర్య పోరాటంలో కూడా ఆదివాసీలు కీలకపాత్ర పోషించారన్నారు. బ్రిటిష్ పాలకుల హింసా కాండపై అల్లూరి సీతారామరాజు, గాం మల్లుదొర, గాం గంటదొర, మర్రి కామయ్య, కోమరం భీం, పండు పడాల్ పోరాట స్ఫూర్తిని ఆదివాసీలు ఆదర్శంగా తీసుకోవాలన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి గిరిజనాభివృద్ధికి, గిరిజన సంక్షేమానికి అధిక ప్రాధాన్యమిస్తున్నారన్నారు. గిరిజనుల మనుగడకు అడ్డుగా ఉన్న 97బాక్సైట్ జీవోను రద్దు చేశారన్నారు. అడవిని నమ్ముకొని జీవిస్తున్న ఆదివాసీలకు ఆర్వోఎఫ్ఆర్ పట్టాలు ఇచ్చారని, పాడేరులో రూ.500 కోట్లతో మెడికల్ కళాశాల నిర్మాణం చేపడుతున్నారన్నారు.

సంస్కృతి, సంప్రదాయాలు కాపాడుకోవాలి: జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర

గిరిజన ఆచార వ్యవహారాలు, సంస్కృతి, సంప్రదాయాలను ప్రతి ఆదివాసీ కాపాడుకోవాలని ఉమ్మడి విశాఖ జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర అన్నారు. గిరిజనుల హక్కులు, చట్టాలు, వ్యవహార శైలి, జీవన విధానం తెలియజేసేందుకే ప్రపంచ ఆదివాసీ దినోత్సవం నిర్వహిస్తున్నట్టు తెలిపారు.

అభివృద్ధికి తోడ్పాటు: ఐటీడీఏ పీవో అభిషేక్

గిరిజనాభివృద్ధికి ఐటీడీఏ ఎంతో తోడ్పాటు అందిస్తోందని పాడేరు పీవో అభిషేక్ పేర్కొన్నారు. ఐటీడీఏ పరిధిలో రూ.250 కోట్లతో రోడ్లు, పాడేరు నియోజకవర్గంలో రూ.100 కోట్లతో రహదారులు నిర్మిస్తున్నామన్నారు. 1.10 లక్షల మంది గిరిజనులకు 2.50 లక్షల ఎకరాలకు ఆర్వోఎఫ్ఆర్ పట్టాలు పంపిణీ చేసినట్టు తెలిపారు. మరో 2,500 మందికి 4,500 ఎకరాల భూమిపై గిరిజనులకు హక్కు పత్రాలు ఇస్తామన్నారు. అరకు పద్మాపురం గార్డెన్‌లో గిరితేజ్ పేరుతో క్యాంటిన్ ఏర్పాటు చేసి గిరిజన వంటకాలను పర్యాటకులకు పరిచయం చేస్తామని వెల్లడించారు. రూ.250 కోట్లతో పాడేరు నుంచి హుకుంపేట వరకు అన్ని హంగులతో రింగ్‌రోడ్డు నిర్మిస్తామన్నారు. ఏజెన్సీలో గతంలో పనిచేసిన 690 మంది మాతృభాషా వలంటీర్లను కొనసాగిస్తూ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిందని ఆయన పేర్కొన్నారు.

సెలవు దినంగా ప్రకటించాలి: సతక బుల్లిబాబు

ప్రపంచ ఆదివాసీ దినోత్సవం రోజున సెలవు దినంగా ప్రకటించాలని రాష్ట్ర ట్రైకార్ చైర్మన్ సతక బుల్లిబాబు కోరారు. ఆదివాసీ చట్టాలు, హక్కులపై ప్రతి ఒక్కరికి అవగాహన ఉండాలన్నారు. భావితరాలకు గిరిజన వారసత్వ సంపదను అందించాలని పిలుపునిచ్చారు.

- ఆదివాసీ దినోత్సవం సందర్భంగా పలు ఆశ్రమ పాఠశాల విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఎంతగానో ఆకట్టుకున్నాయి.

వ్యవసాయ యాంత్రీకరణ పరికరాల పంపిణీ

సీసీడీపీ నిధులు రూ.2.24 కోట్లతో అర్హులైన గిరిజన రైతులకు వ్యవసాయ యాంత్రీకరణ పరికరాలను పంపిణీ చేశారు. ఒక్కో పవర్ వీడర్ రూ.లక్షా17వేల 300 కాగా రూ.లక్ష రాయితీపై రైతులకు అందజేశారు. మొత్తం 224 పవర్ వీడర్లు మంజూరు కాగా తొలుత 85 మంది గిరిజన రైతులకు పంపిణీ చేశారు. రూ.65 వేల విలువైన పసుపు బాయిలర్లు, రూ.75 వేల విలువైన పసుపు శుద్ధి యంత్రాలను రైతులకు పూర్తిశాతం రాయితీపై అందజేశారు.

సమరయోధుల వారసులకు సత్కారం

స్వాతంత్ర్య సమరయోధుల వారసులను ఘనంగా సత్కరించారు. తగ్గి వీరయ్య మనువరాలు సాగిన లింగమ్మ, మర్రి కామయ్య మనువడు మర్రి సుధాకర్, ప్రభుత్వ భవనాల నిర్మాణాలకు 15 ఎకరాల పట్టా భూమిని దానం చేసిన ముంచంగిపుట్టు మండలం జోలాపుట్టు మాజీ సర్పంచ్ వంతాల రామస్వామి, మామిడి చంద్రారావు, తీగలవలస సర్పంచ్ పాంగి బేసు, గొల్లోరి మంగ్లన్నను సన్మానించారు. తుడుం కొట్టి జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలను ప్రారంభించారు. కార్యక్రమంలో ఐటీడీఏ ఏపీవోలు వీఎస్ ప్రభాకర్‌రావు, ఎం. వెంకటేశ్వరరావు, ఏపీ మెడికల్ కౌన్సిల్ సభ్యులు డాక్టర్ టి. నర్సింగరావు, పాడేరు ఎంపీపీ సొనారి రత్నకుమారి, పాడేరు సర్పంచ్ కొట్టగుళ్లి ఉషారాణి, ఎస్టీ కమీషన్ సభ్యులు జంపరంగి లిల్లీ, కొర్రా రామలక్ష్మి పాల్గొన్నారు.

గిరిజన చట్టాల అమలుకు కృషి: రంపచోడవరం ఎమ్మెల్యే ధనలక్ష్మి

రంపచోడవరం: గిరిజన చట్టాల అములుకు కృషిచేస్తున్నట్టు రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి అన్నారు. స్థానిక వైటీసీలో బుధవారం జరిగిన ప్రపంచ ఆదివాసీ దినోత్సవ వేడుకల్లో ఆమె పాల్గొన్నారు. పందిరిమామిడి సెంటర్ నుంచి స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు గిరిజనులతో కలిసి ర్యాలీగా బయలుదేరి వైటీసీకి చేరుకున్నారు. ఆకుపచ్చ జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పందిరిమామిడి–కోట రోడ్డు నిర్మాణంలో అటవీ అభ్యంతరాలు తొలగినందున నిర్మాణ పనులు ప్రారంభమవుతాయన్నారు. ఏజెన్సీలోని గిరిజన తెగలు గిరిజన ప్రాంత అభివృద్ధికి కలిసికట్టుగా రావాలన్నారు. కొండ రెడ్డి, కోయదొర, వాల్మీకి, కొండ కమ్మర, కొండదొర, మన్నె దొర, కొండ కాపు కులస్తులతో జ్యోతి ప్రజ్వలను చేసి వేడుకలను ప్రారంభించారు. ఏడుగురు కుల పెద్దలను సత్కరించారు. సాంస్కృతిక కార్యక్రమాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. వివిధ స్టాళ్లను ఎమ్మెల్యే సందర్శించారు. ఎంపీపీలు బంధం శ్రీదేవి,కుంజం మురళీ, పల్లాల కృష్ణారెడ్డి, కడబాల ఆనంద్, జెడ్పీటీసీలు పండా వెంకటలక్ష్మి, బేబీరత్నం, వైస్ ఎంపీపీలు కొమ్మిశెట్టి బాలకృష్ణ, పండా కుమారి, సర్పంచ్‌లు మంగా బొజ్జియ్య, వడగల ప్రసాద్, ఎంపీటీసీలు ఉలవల లక్ష్మి, కుంజం వంశీ, అన్నవరం దేవస్థాన బోర్డు మెంబరు కారుకోడి పూజ, ఏపీవో శ్రీనివాస్ పాల్గొన్నారు.



చింతూరులో నివాళులర్పిస్తున్న పీవో సూరజ్ గనోరే

ఆదివాసీల చెంతకు అభివృద్ధి ఫలాలు

ఐటీడీఏ పీవో సూరజ్ గనోరే

చింతూరు: ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ఆదివాసీల చెంతకు చేర్చేందుకు ఐటీడీఏ కృషి చేస్తోందని పీవో సూరజ్ ధనుంజయ్ గనోరే అన్నారు. ఐటీడీఏ ఆధ్వర్యంలో బుధవారం చింతూరులో ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముందుగా ఐటీడీఏ కార్యాలయంలో ఆదివాసీ జెండాను ఎగురవేసిన పీవో ఆదివాసీ నాయకులు, ఉద్యోగులతో కలసి బైక్‌పై మెయిన్ సెంటర్ వరకు ర్యాలీగా వెళ్లారు. అనంతరం ఆదివాసీ యోధులు కొమరం భీం, అల్లూరి సీతారామరాజు, గంటందొర, మల్లుదొర విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. స్థానిక గురుకుల పాఠశాల ఆవరణలో జరిగిన ఆదివాసీ దినోత్సవ వేడుకల్లో పీవో మాట్లాడుతూ ఆదివాసీల అభ్యున్నతికి ఐటీడీఏ పాటుపడుతోందన్నారు. ఆదివాసీ నాయకులు, ఉద్యోగులు, జేఏసీ నాయకులను సన్మానించారు. అనంతరం వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు ప్రదర్శించిన ఆదివాసీ నృత్య ప్రదర్శనలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఏపీవో కంచర్ల సుజాత, తహసీల్దార్ కారం సుబ్బారావు, ఎంపీడీవో వెంకటరత్నం, ఏవో రాజ్‌కుమార్, ఎస్టీ కమీషన్ సభ్యుడు చిచ్చడి మురళి, జెడ్పీటీసీ గుజ్జా విజయ, ఎంపీపీలు సవలం అమల,కామేశ్వరి, రంగమ్మ, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, ఆదివాసీ నేతలు సోడె నారాయణ, కుర్సం సుబ్బారావు, జల్లి నరేష్, తిమ్మ సాయి, మానె రాంప్రసాద్, కణితి శేఖర్ పాల్గొన్నారు.



విద్యార్థుల నృత్య ప్రదర్శనలు

స్వాతంత్ర్య దినోత్సవానికి పక్కాగా ఏర్పాట్లు

కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశం



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్, పక్కన ఐటీడీఏ పీవో అభిషేక్

పాడేరు రూరల్ : స్వాతంత్ర్య దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ అధికారులను ఆదేశించారు. వేడుకల ఏర్పాట్లపై బుధవారం స్థానిక ఐటీడీఏ సమావేశ మందిరంలో జిల్లా స్థాయి అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పట్టణంలోని తలార్‌సింగి ఆశ్రమ పాఠశాల మైదానంలో ఉదయం తొమ్మి గంటలకు ప్రారంభమవుతాయన్నారు. ఈ కార్యక్రమానికి జిల్లా ఇన్‌చార్జి మంత్రి గుడివాడ అమర్‌నాథ్ ముఖ్య అతిథిగా విచ్చేస్తారన్నారు. ఈ సందర్భంగా జాతీయ పతాకం ఆవిష్కరణ అనంతరం స్వాతంత్ర్య సమరయోధులతో పరిచయ కార్యక్రమం, మాక్ డ్రిల్, సాంస్కృతిక కార్యక్రమాలు, ప్రశంసా పత్రాల పంపిణీ తదితర కార్యక్రమాలు ఉంటాయన్నారు. పెరేడ్‌ను పోలీస్ శాఖ నిర్వహించాలని ఆదేశించారు. వేదిక ఏర్పాట్లను గిరిజన సంక్షేమ ఇంజనీరింగ్ శాఖ, రెవెన్యూ డివిజనల్ అధికారి, తహసీల్దార్ పర్యవేక్షించాలని సూచించారు. అన్ని ప్రభుత్వ ప్రభుత్వ శాఖల సంక్షేమ కార్యక్రమాలు ప్రతిబింబించేలా శకటాలను, స్టాళ్లను ఏర్పాటుచేయాలని ఆదేశించారు. ప్రభుత్వ శాఖల్లో ఉత్తమ సేవలు అందించిన ఉద్యోగుల వివరాలను అందజేయాలని సూచించారు. ప్రతి శాఖ నుంచి సత్ప్రవర్తన, నిజాయితీ అంకితభావంతో విధులు నిర్వర్తించిన వారిని మాత్రమే ప్రతిపాదించాలని ఆదేశించారు. వాతవరణ పరిస్థితులను దృష్టిలో పెట్టుకొని రెయిన్ ప్రూఫ్ టెంట్లను ఏర్పాటు చేయాలన్నారు. విధులు సక్రమంగా నిర్వహించి కార్యక్రమం విజయవంతానికి కృషి చేయాలన్నారు. ఐటీడీఏ పీవో అభిషేక్, జిల్లా రెవెన్యూ శాఖ అధికారి అంబేద్కర్, డీఎస్‌వో గణేష్, డీఎంహెచ్‌వో డాక్టర్ జమాల్‌బాషా, హౌసింగ్ ఈఈ బాబు, డీఆర్‌డీఏ పీడీ మురళి, ఐసీడీఎస్ పీడీ సూర్యలక్ష్మి, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి నందు, ఉద్యానవన శాఖ అధికారి రమేష్ పాల్గొన్నారు.

438 మందికి రూ.4.37 కోట్ల మేర లబ్ధి



నమూనా చెక్కును అందజేస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్, రాష్ట్ర ట్రైకార్ చైర్మన్ బుల్లిబాబు



సీఎం కార్యక్రమాన్ని వీక్షిస్తున్న కలెక్టర్, అధికారులు, లబ్ధిదారులు

- కలెక్టర్ సుమిత్‌కుమార్
- వైఎస్సార్ కల్యాణమస్తు, వైఎస్సార్ షాదీ తోఫా పంపిణీ

పాడేరు రూరల్ : వైఎస్సార్ కల్యాణమస్తు, వైఎస్సార్ షాదీ తోఫాతో 438 మందికి రూ.4 కోట్ల 37లక్షల 45వేల మేర లబ్ధి చేకూరిందని కలెక్టర్ సుమిత్‌కుమార్ తెలిపారు. ఇందుకు సంబంధించి నిధుల విడుదల కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బుధవారం తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుంచి వర్చువల్ విధానంలో నిధులు విడుదల చేశారు. ఈ కార్యక్రమ ప్రసారాన్ని కలెక్టరేట్‌లో అధికారులు, లబ్ధిదారులు తిలకించారు. అనంతరం మంజూరైన మొత్తాన్ని లబ్ధిదారులకు నమూనా చెక్కు రూపంలో రాష్ట్ర ట్రైకార్ చైర్మన్ సతక బుల్లిబాబుతో కలిసి కలెక్టర్ సుమిత్‌కుమార్ అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ సొమ్మును వధూవరుల తల్లుల ఖాతాల్లో ప్రభుత్వం జమ చేస్తుందన్నారు. బాల్య వివాహాల నివారణ, చదువులను ప్రోత్సహించడం, పేద కుటుంబాలకు చెందిన వధువుల తల్లిదండ్రులను ఆర్థికంగా ఆదుకోవడం ఈ పథకం ముఖ్య ఉద్దేశమన్నారు. ఈ ఏడాది ఏప్రిల్–జూన్ త్రైమాసికంలో వివాహం చేసుకున్న వధూవరులకు ఈ మొత్తాన్ని పంపిణీ చేస్తున్నట్టు ఆయన వివరించారు. ఈ పథకాల కింద పేద కుటుంబాలకు చెందిన ఎస్సీ,ఎస్టీ, బీసీ, మైనార్టీ, దివ్యాంగులు, భవన నిర్మాణ కార్మికులల ఆడపిల్ల వివాహాలకు ఆర్థిక సహాయం అందజేయడం జరుగుతుందన్నారు. జిల్లాలో 373 మంది ఎస్టీ, 22 మంది ఎస్సీ, 30 బీసీ, ముగ్గురు దివ్యాంగులు, ఇద్దరు మైనారిటీలు లబ్ధిపొందారన్నారు. రాష్ట్ర ట్రైకార్ చైర్మన్ సతక బుల్లిబాబు మాట్లాడుతూ అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాల ద్వారా ఆర్థిక భరోసా కల్పిస్తున్న ఘనత సీఎం జగన్ మోహన్‌రెడ్డికి దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ సంచాలకుడు మురళి తదితరులు పాల్గొన్నారు.

వైద్య ఆరోగ్యశాఖలో నకి‘లీలలు’

- స్టాఫ్ నర్సు నియామకంలో విశాఖ డీఎంహెచ్‌వో పేరుతో నకిలీ ఆర్డర్
- షాకైన సిబ్బంది, పోలీసులకు ఫిర్యాదు



డీఎంహెచ్‌వో పేరిట నకిలీ ఉత్తర్వుల కాపీ

మహారాణిపేట(విశాఖ) : వైద్య ఆరోగ్య శాఖలో నకిలీలు వదిలి పెట్టడం లేదు. ఒక వైపు ఫేక్ సర్టిఫికెట్లు.. మరోవైపు నకిలీ అపాయింట్‌మెంట్ ఆర్డర్లు వైద్య ఆరోగ్యశాఖను కుదిపేస్తున్నాయి. కొద్ది రోజుల క్రితమే నకిలీ ఆర్డర్ల వ్యవహారం తీవ్ర దుమారం రేపగా.. తాజాగా అదే తరహా మరో వ్యవహారం వెలుగులోకి వచ్చింది. తాజాగా స్టాఫ్ నర్సు పోస్టు కోసం బి.రమాదేవి అపాయింట్‌మెంట్ ఆర్డర్ విశాఖ డీఎంహెచ్‌ఓ డాక్టర్ పి.జగదీశ్వరరావు పేరుతో రావడం కలకలం రేపుతోంది. గత రెండేళ్లుగా వైద్య ఆరోగ్య శాఖలో వివిధ రకాల పోస్టులను భర్తీ చేస్తున్నారు. ఇప్పటికే మెజార్టీ పోస్టులను భర్తీ చేశారు. ఇదిలా ఉంటే అల్లూరి సీతారామరాజు జిల్లా జి.మాడుగుల మండలం వంతల గ్రామానికి చెందిన బి.రమాదేవి అరకు కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో స్టాఫ్ నర్సుగా అపాయింట్‌మెంట్ అందజేసింది. ఆ నియామక పత్రాన్ని పరిశీలన నిమిత్తం మూడు జిల్లాల నోడల్ ఆఫీసర్ అయిన విశాఖ డీఎంహెచ్‌వో కార్యాలయానికి పంపించారు. అందులో డీఎంహెచ్‌వో డాక్టర్ పి.జగదీశ్వరరావు పేరుతో అపాయింట్‌మెంట్ ఆర్డర్ ఉండడాన్ని సిబ్బంది గమనించారు. ఆ నియామక జాబితాను పరిశీలించగా అందులో ఆమె పేరు లేనట్లు గుర్తించారు. దీంతో ఆ అపాయింట్‌మెంట్ లెటర్ ఫేక్ అని నిర్ధారణకు వచ్చారు.

గతంలో 11 నకిలీ ఆర్డర్లు..

ఇదే తరహాలో 2020 నుంచి ఇప్పటివరకు 11 నకిలీ అపాయింట్‌మెంట్ ఆర్డర్లను అధికారులు గుర్తించారు. గత డీఎంహెచ్‌వో డాక్టర్ పి.సూర్యనారాయణ పేరుతో నియామక ఉత్తర్వులు వెలుగు చూశాయి. ముంచంగిపుట్టు, భీమవరం పీహెచ్‌సీ, నర్సీపట్నం ఏరియా ఆస్పత్రి, చింతపల్లి సీహెచ్‌సీ, సీలేరు పీహెచ్‌సీ ఇలా మరికొన్ని ప్రాంతాల నుంచి వచ్చిన నకిలీ ఆర్డర్లు అధికారులను విస్తుపోయేలా చేశాయి. వారందరిపై పోలీసులకు ఫిర్యాదు సైతం చేశారు. తాజా వ్యవహారంతో వైద్య ఆరోగ్య శాఖలో నకిలీ ఉత్తర్వులతో ఎంత మంది ఉద్యోగాలు చేస్తున్నారన్న అంశం చర్చనీయాంశంగా మారింది.

పోలీసులకు ఫిర్యాదు

రమాదేవి నియామక ఉత్తర్వు నకిలీదని గుర్తించిన డీఎంహెచ్‌వో అధికారులు ఆ విషయాన్ని అల్లూరి జిల్లా అధికారులకు సమాచారం అందించారు. దీంతో ఆ జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు రమాదేవిని పిలిపించి ఆ ఆర్డర్ ఎవరు ఇచ్చారన్న విషయంపై ప్రశ్నించారు. మన్యం ప్రాంతానికి చెందిన బి.ఎస్.రాజు రూ.2.50 లక్షలు తీసుకొని ఆర్డర్ ఇచ్చారని ఆమె అధికారులకు లిఖిత పూర్వకంగా సమాధానమిచ్చింది. దీనిపై అల్లూరి జిల్లా క్షయ నివారణ అధికారి డాక్టర్ టి.విశ్వేశ్వరనాయుడు జి.మాడుగుల పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. రమాదేవికి తాను ఆర్డర్ ఇవ్వలేదని విశాఖ జిల్లా డీఎంహెచ్‌వో డాక్టర్ పి.జగదీశ్వరరావు తెలిపారు. ఇలాంటి నకిలీ ఆర్డర్లు ఎక్కువగా మన్యం ప్రాంతం నుంచి వస్తున్నాయన్నారు.

490 కిలోల గంజాయి పట్టివేత

- ఇద్దరు అరెస్టు
- నలుగురు పరారీ



పట్టుబడిన గంజాయి, నిందితులతో పోలీసులు

చింతపల్లి: మైదాన ప్రాంతానికి తరలించేందుకు టేకు ప్లాంటేషన్‌లో సిద్ధంగా ఉంచిన గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు . ఎస్‌ఐ అరుణ్ కిరణ్ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. సాడిక గ్రామానికి చెందిన కిముడు శివ అదే గ్రామానికి చెందిన బేరా సతీష్‌కుమార్‌తో కలిసి ఒడిశాలో 490 కిలోల గంజాయి కొనుగోలు చేశారు. అక్కడినుంచి మైదానప్రాంతానికి తరలించేందుకు కప్పగొందికి చెందిన నలుగురితో వారు ఒప్పందం చేసుకున్నారు. ఈ మేరకు ఆటో, ద్విచక్రవాహనం గంజాయిని తీసుకువచ్చి సాడిక టేకు ప్లాంటేషన్ వద్ద ఉంచారు. ఈ విషయం తెలుసుకున్న ఎస్‌ఐ అరుణ్ కిరణ్ టేకు ప్లాంటేషన్ వద్ద తనిఖీలు నిర్వహించారు. నలుగురు అక్కడి నుంచి పరారు కాగా శివ, బేరా సతీష్‌కుమార్‌ను అదుపులోకి తీసుకున్నారు. గంజాయితోపాటు ఆటో, బైక్‌ను సీజ్ చేశారు. వారి నుంచి రూ.74వేల నగదును స్వాధీనం చేసుకున్నారు. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ పేర్కొన్నారు.

క్లుప్తంగా

గ్రామాల్లో జోరుగా ఓటర్ల నమోదు



ముంచంగిపుట్టులో ఓటరు నమోదు పత్రాలు స్వీకరిస్తున్న బీఎల్‌వో రమేష్

ముంచంగిపుట్టు: మండలంలో 23 పంచాయతీల్లో గిరిజన గ్రామాల్లో జోరుగా ఓటర్ల నమోదు కార్యక్రమం జరుగుతుంది. బీఎల్‌వోలు 18 సంవత్సరాల నిండిన యువతకు ఓటు హక్కును వివరించి, వారి నుంచి ఓటు నమోదు పత్రాలను స్వీకరిస్తున్నారు. ఈ నెల 17వ తేది లోగా అర్హులంతా ఓటర్లగా నమోదు చేసుకోవాలని, తప్పులు ఉన్న సరిచేసుకోవాలని గ్రామాల్లో గిరిజనులను కోరుతున్నారు. బీఎల్‌వోలు రమేష్, సీతమ్మ, విజయలక్ష్మి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

102 మంది గర్భిణులకు వైద్య పరీక్షలు



గర్భిణులకు స్కానింగ్ చేస్తున్న వైద్యాధికారులు, సూపరింటెండెంట్ డాక్టర్ రాహుల్

వై.రామవరం: పీఎంఎస్ఎంఏ కార్యక్రమంలో భాగంగా స్థానిక కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో బుధవారం 102 మంది గర్భిణులకు ప్రత్యేక వైద్య పరీక్షలు నిర్వహించారు. స్థానిక సీహెచ్‌సీ సూపరింటెండెంట్ డాక్టర్ రాహుల్ ఆధ్వర్యంలో గర్భిణులకు స్కానింగ్‌లు, రక్తపరీక్షలు నిర్వహించి, మందులు అందజేశారు. వారిలో 22 మంది హైరిస్క్ గర్భిణులను గుర్తించి ఆస్పత్రిలో జాయిన్ చేసుకున్నారు. వారికి ప్రత్యేక వైద్యసేవలతోపాటు, అవసరమైన మందులు అందించారు. శిబిరానికి హాజరైన గర్భిణులకు భోజన వసతి, రవాణా సౌకర్యాలు కల్పించారు. గైనికాలజిస్టు ఆర్.జగదాంబ, సీహెచ్‌సీ వైద్యాధికారులు చైతన్య, జీవన్, మధులత, సిబ్బంది పాల్గొన్నారు. మండలంలోని చవిటిదిబ్బలు పీహెచ్‌సీలో వైద్యాధికారుల నరేంద్ర, దినేష్‌ల ఆధ్వర్యంలో గర్భిణులకు స్కానింగులు, ప్రత్యేక వైద్యపరీక్షలు నిర్వహించారు.

వెదురు కంజి భలే రుచి

- వెదురుతో గిరిజనుల ప్రత్యేక వంటకాలు
- సంతల్లో జోరుగా అమ్మకాలు

ముంచంగిపుట్టు: కూరగాయల్లో ఎన్నో రకాలు ఉంటాయి. మన్యంలో అయితే మరెన్నో రకాల కూరగాయలు లభ్యమవుతాయి. వెదురు నుంచి తీసిన కూరని ఎప్పుడైన వండుకొని తిని ఉంటారా? వినడానికే ఎంతో కొత్తగా ఉన్న మన్యం వాసులు మాత్రం వెదురు నుంచి తీసిన చిగురును కూర వండుకొని తింటారు. దీనిని మన్యం వాసులు వెదురు కొమ్ములు, వెదురు కంజి అని కూడా పిలుస్తారు. కానీ వెదురు కంజి కూర టేస్టే వేరు.వెదురు కొమ్ములు సీజన్ మొదలైయింది. ప్రస్తుతం మన్యంలో మండల కేంద్రాలు, వారపు సంతల్లో వెదురు కంజి అమ్మకాలు హాట్ కేకుల్లా జరుగుతున్నాయి. అటవీ, కొండ ప్రాంతాల్లో ఉన్న వెదురు బొంగు నుంచి లేత వెదురును తీసి చిగురును సేకరిస్తారు. దానిని శుభ్రపరిచి ముక్కలుగా చేస్తారు. వాటిని సంతల్లో రూ.20 నుంచి రూ.50 లు వరకు వాటాలుగా విక్రయిస్తారు. వెదురు కంజిని రెండు రకాలుగా కూర తయారికి వినియోగిస్తారు. పచ్చి వెదురు కంజిని ఒక రకంగా కూర తయారు చేస్తారు. వెదురు కంజిని ఎండబెట్టి మరో విధంగా కూర తయారికీ వినియోగిస్తారు. పచ్చిగా ఉన్నప్పుడు అప్పటికప్పుడే కూర తయారు చేసుకోవాలి. ముఖ్యంగా కూర తయారు చేసే ముందు రెండు మూడు సార్లు వెదురు కంజినీ బాగా కడుగుకోవాలని గిరిజనులు చెబుతున్నారు. ఎండబెట్టుకొని ఉంటే ఏడాది కాలంలో ఎప్పుడైనా కూర తయారికి వినియోగించుకోవచ్చు. ఈ వెదురు కంజి కూరను మన్యం వాసులంతా చాలా ఇష్టంగా తింటారు. వెదురు కంజిని వేపుడు, పచ్చడి, పులుసు వంటి రకాలుగా కూరును తయారు చేస్తారు.



వెదురు కొమ్ములను సంతలో అమ్ముతున్న గిరిజన మహిళ



అమ్మకానికి సిద్ధంగా ఉన్న తరిగిన వెదురు కంజి ముక్కలు

ఎన్నో ఉపయోగాలు

వెదురు కంజి కూర తయారు చేసే ముందు రెండు, మూడు సార్లు నీటితో శుభ్రం చేస్తారు. అప్పుడు వెదురు కంజిలో ఉండే చేదుపోతుంది. బాగా ఉడకబెట్టి దాని కషయాన్ని తీసుకుంటారు. దీంతో రక్తం శుద్ధి అవుతుందని, శరీరానికి తక్షణ శక్తి అందుతుందని, జీర్ణశక్తి మెరుగుపడడంతో పాటు నులిపురుగులను నివారిస్తుందని గిరిజనులు చెబుతారు. వెదుర కంజి ద్రావణాన్ని మారుమూల గిరిజనులు పాము, తేలు కాటులకు ఔషధంగా సైతం వినియోగిస్తారు. వెదురు కంజి ఉపయోగాలెన్నో అని గిరిజనులు చెబుతారు.

రుచికరంగా వంటకాలు

వెదురు కొమ్ములతో తయారుచేసిన వంటకాన్ని ఎక్కువగా గర్భిణులకు అందజేస్తారు. దీనిలో ఉండే ఔషధ గుణాలు గర్భిణులకు ఎంతో మేలు చేస్తాయి. గిరిజన ప్రాంతంలో వాతావరణం చల్లగా ఉండడం వల్ల శరీరానికి వెంటనే వేడి చేసే గుణం వెదురు కంజి కూరల్లో ఉంటుంది. వెదురు కొమ్ముల కూర రుచికరంగా ఉంటుంది. ఈ నాలుగు నెలలు మాత్రమే వెదురు కొమ్ములు లభ్యమవుతాయి.అడవీ, కొండ ప్రాంతాల్లో లేత వెదురు నుంచి వెదురు కొమ్ములను సేకరిస్తారు .వారపు సంతలో విక్రయిస్తారు.

– రాధమ్మ, సుజనకోట గ్రామం, ముంచంగిపుట్టు మండలం

అమ్మకాలు బాగున్నాయి

వారపు సంతల్లో వెదురు కొమ్ముల అమ్మకాలు బాగున్నాయి. కొమ్ముల వాటా రూ20, రూ.50 చొప్పున అమ్ముతున్నాము. గతంలో మా గిరిజన ప్రాంతానికి చెందిన వారే కొనుగోలు చేసేవారు. ఇప్పుడు మైదాన ప్రాంతం నుంచి వచ్చి కూడా వెదురు కొమ్ములను కొనుగోలు చేస్తున్నారు. కొమ్ములను పచ్చిగాను, ఉడకబెట్టి విక్రయిస్తున్నాం. శనివారం ముంచంగిపుట్టు వారపు సంతలో కొమ్ములు తెచ్చిన గంటల వ్యవధిలోనే అమ్ముడు పోయాయి.

– కె.దొణ, పెదతమ్మెంగుల గ్రామం, ముంచంగిపుట్టు మండలం

పౌర సేవలకు ప్రాధాన్యం

- రేషన్ కార్డులు తిరస్కరించిన తహసీలార్లకు వివరణ కోరుతూ నోటీసులు
- గ్రామ సచివాలయ సిబ్బంది హాజరు ఫొటోలు పంపాలి
- కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశం

పాడేరు రూరల్ : గ్రామ సచివాలయ సిబ్బంది విధులకు సక్రమంగా హాజరు కావడం లేదని వస్తున్న ఫిర్యాదుల నేపథ్యంలో వారి హాజరును ఫొటోలతో సహా నివేదిక సమర్పించాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ ఎంపీడీవోలను ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో బుధవారం జిల్లాలోని 11 మండలాల ఎంపీడీవోలు, తహసీల్దార్‌లతో నేరుగా మిగిలిన వారితో వీడియో సమావేశం నిర్వహించారు. ప్రజా సేవకే ప్రాధాన్యమివ్వాలన్నారు. గ్రామ రెవెన్యూ సహాయకులు తప్పనిసరిగా గ్రామ సచివాలయాల్లోనే విధులు నిర్వహించాలని ఆదేశించారు. ఆలస్యపు జనన ధ్రువీక్రణలకు సంబంధించి సుమారు 12వేల వరకు పెండింగ్‌లో ఉన్నందున సోమవారం లోగా పూర్తి చేయాలని ఆదేశించారు. కొత్త బియ్యం కార్డులకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను వివిధ కారణాలతో 500 తిరస్కరించడంపై ఆరా తీశారు. తిరస్కరణకు గల కారణాలను వివరణ కోరుతూ తహసీల్దార్‌లకు నోటీసులు జారీ చేయాలని జిల్లా రెవెన్యూ అధికారి అంబేడ్కర్‌ను ఆదేశించారు. ప్రజల కోసం పని చేస్తున్నామని గుర్తించాలన్నారు. అమ్మఒడి, కళ్యాణమస్తు, రైతు భరోసా తదితర పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. పాఠశాలలకు వెళ్ళని విద్యార్థులను గుర్తించి సంబంధిత గ్రామ వలంటీర్ ద్వారా వారు సక్రమంగా పాఠశాలలకు హాజరయ్యేలా చూడాలన్నారు. సమావేశంలో గ్రామ, వార్డు సచివాలయాల సమ్వయకర్త సునీల్, కలెక్టర్ కార్యాలయం తహాశీల్దార్ చిన్నికృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ ఎన్నికలకు నామినేషన్ల బోణీ



లక్ష్మీపురంలో 2వ వార్డు అభ్యర్థి నుంచి నామినేషన్ స్వీకరిస్తున్న ఆర్వో కృష్ణమూర్తి

పెదబయలు: మండలంలోని పెదకోడాపల్లి గ్రామ పంచాయతీ సర్పంచ్ ఎన్నికలకు సంబంధించి బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఒక నామినేషన్ దాఖలయ్యిందని స్టేజ్ వన్ ఎన్నికల అధికారి కె.కృష్ణమూర్తి తెలిపారు. పదో తేదీ నామినేషన్ల చివరి రోజు కావడంతో నేడు నామినేషన్లు దాఖలయ్యే అవకాశం ఉందని తెలిపారు.

వార్డు సభ్యుడి పదవికి..

ముంచంగిపుట్టు: మండలంలోని లక్ష్మీపురం పంచాయతీ రెండవ వార్డు నుంచి ఒక నామినేషన్ బుధవారం స్వీకరించామని మండల ఎన్నికల రిటర్నింగ్ అధికారి కె.కృష్ణమూర్తి తెలిపారు. మండలంలో కుమడ, లక్ష్మీపురం, భూసిపుట్టు పంచాయితీల నుంచి 12 స్థానాల్లో వార్డు మెంబర్ ఎన్నికకు నామినేషన్లు స్వీకరిస్తున్నామని ఆయన వివరించారు. లక్ష్మీపురం పంచాయతీ నుంచి రెండవ వార్డు అన్ రిజర్వుడ్ కోసం గిర్లియ మోహన్‌రావు నామినేషన్ అందజేసినట్టు ఆయన వివరించారు.

రాష్ట్రంలో కులమతాలకు అతీతంగా పాలన

- మాదిగలకు ఎమ్మెల్సీ ఇచ్చిన ఘనత జగనన్నదే
- ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయెల్



పాయకరావుపేటలో విలేకర్లతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ ఇజ్రాయెల్

నక్కపల్లి/ పాయకరావుపేట: రాష్ట్రంలో కులమతాలకు అతీతంగా పరిపాలన సాగుతోందని, ఏ ఒక్క నాయకుడికి ప్రభుత్వాన్ని విమర్శించే అర్హత లేదని, మాదిగలకు ఎమ్మెల్సీ పదవి కేటాయించిన ఘనత ముఖ్యమంత్రి జగనన్నదేనని ఉభయ గోదావరి జిల్లాల ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయెల్ అన్నారు. బుధవారం ఆయన పాయకరావుపేటలో విలేకర్లతో మాట్లాడారు. ఎన్నికల ముందు పాదయాత్రలో ఇచ్చిన హామీ మేరకు మాదిగలకు ఎమ్మెల్సీ పదవిని కేటాయించి తనను ఎంపిక చేసారన్నారు. అన్ని వర్గాల వారికి సంక్షేమ ఫలాలను పారదర్శకంగా అందిస్తున్నారన్నారు. గతంలో వరదల సమయంలో బాధిత గ్రామాల్లో చంద్రబాబు హెలీకాప్టర్‌లో మాత్రమే పర్యటించేవారన్నారు. హంగులు, ఆర్భాటాలు తప్ప బాధితులకు ఒక్క పైసా కూడా విడుదల చేసే వారు కాదన్నారు. జగనన్న అలా కాదని, అల్లూరి సీతారామరాజు జిల్లా ఉభయ గోదావరి, కోనసీమ జిల్లాల్లో లంక ప్రాంత గ్రామాల్లో ఇటీవల వచ్చిన వరదల వల్ల ఇబ్బందిపడుతున్న బాధిత గ్రామాల్లో రోడ్డుమార్గంలో ప్రయాణించి వరద బాధితుల కష్టాలను స్వయంగా తెలుసుకున్నారన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై థ్యాక్యూ సీఎం పేరుతో రాష్ట్రంలో అన్ని గ్రామాల్లోను పర్యటిస్తామని ఎమ్మెల్సీ ఇజ్రాయిల్ తెలిపారు. సమావేశంలో మాదిగ రక్షణ పోరాట సమితి అధ్యక్షుడు ఆరుగల మోషే, ఎంపిఆర్‌పిఎస్ కాకినాడ జిల్లా అధ్యక్షుడు ముప్పిడి శ్యామ్‌కుమార్ పాల్గొన్నారు.

సహకార సంఘాల అధ్యయనానికి ప్రత్యేక బృందం

ఉమ్మడి విశాఖ జిల్లా నుంచి 25 సంఘాలు ఎంపిక



అధ్యయన యాత్రకు వెళ్తున్న పీఏసీఎస్‌ల సీఈవోల బృందానికి స్వాగతం పలికిన పాయకరావుపేట సంఘ నాయకులు

నక్కపల్లి/పాయకరావుపేట: ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల బలోపేతానికి తీసుకోవాల్సిన చర్యలపై అధ్యయనం చేసేందుకు ప్రభుత్వం ఉమ్మడి విశాఖ జిల్లా నుంచి 25 పీఏసీఎస్‌లను ఎంపిక చేసి వాటి సీఈవోలను కాకినాడ , కోనసీమ జిల్లాలకు పంపించింది. బుధవారం ఈ బృందం ప్రత్యేక బస్సులో బయలుదేరి వెళ్లింది. వీరు కాకినాడ జిల్లా ర్యాలీ, అంబేద్కర్ కోనసీమ జిల్లా తొౖరెడు పీఏసీఎస్‌లను సందర్శిస్తుంది. సంఘాల పనితీరును మరింత పెంచేందుకు అధ్యయన యాత్ర నిర్వహిస్తున్నట్టు డీసీసీబీ వర్గాలు తెలిపాయి. రైతులకు రుణాలు అందిస్తూ సంఘాల బలోపేతానికి తొౖరెడు, ర్యాలీ సంఘాలు సత్ఫలితాలు సాధిస్తున్నాయి. ఈ రెండు సంఘాల టర్నోవర్, రుణ వితరణ, రికవరీ శాతం, రకవరీకి తీసుకుంటున్న చర్యలు ఈ సంఘాల నుంచి తెలుసుకోవడం జరుగుతుందని వారు తెలిపారు. జిల్లా పిఏసీఎస్‌ల డెవలప్‌మెంట్ మేనేజర్ జి.వి.ఎస్.ఎన్ రాజు నేతత్వంలో అధ్యయనానికి వెళ్తున్న ఈ బృందానికి డీసీసీబీ సీఈవో వర్మ జెండా ఊపి ప్రారంభించారు. పాయకరావుపేట పీఏసీఎస్ చైర్మన్ రాజేష్ ఖన్నా, సీఈవో భూషణంలు స్వాగతం పలికి ఉదయం అల్పాహారం ఏర్పాటు చేశారు. అధ్యయనానికి వెళ్లే సంఘాల్లో పి.లక్కవరం, కలిగొట్ల, ఎం.కె.వల్లాపురం, మాడుగుల, లక్ష్మీపురం, ములకాలపల్లి, దేవరాపల్లి, నాగులాపల్లి, తుంపాల, పాయకరావుపేట, చూచుకొండ, కొండకర్ల, రోలుగుంట, చౌడువాడ, చోద్యం రాంబిల్లి, బుచ్చియ్యపేట, నాతవరం, నర్సీపట్నం, దిమిలి, వీరనారాయణం, తిమ్మరాజుపేట, చోడవరం, గొడిచర్ల, నక్కపల్లి సంఘాల సీఈఓలు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో పంచాయతీ కార్యదర్శి మృతి

గోపాలపట్నం: రోడ్డు ప్రమాదంలో గాయపడిన గంట కృష్ణ(47) నగరంలోని ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బుధవారం ఉదయం మృతి చెందాడు. ఎయిర్‌పోర్టు పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. విమాన్‌నగర్‌లో నివాసముంటున్న గంటా కృష్ణ చోడవరం మండలం జన్నవరంలో పంచాయతీ కార్యదర్శిగా నిధులు నిర్వహిస్తున్నారు. సోమవారం రాత్రి విధులు పూర్తి చేసుకుని ఇంటికి బయలుదేరారు. ఎన్ఏడీ జంక్షన్‌లో బస్సు దిగి ఆటోలో విమాన్‌నగర్ బస్‌స్టాప్ వద్దకు చేరుకున్నాడు. రోడ్డు దాటుతుండగా ఎన్ఏడీ నుంచి వస్తున్న ద్విచక్రవాహనం బలంగా ఢీకొట్టడంతో తలకు, శరీరంపై పలు చోట్ల గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం నగరంలో ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించారు. బుధవారం కృష్ణ మృతి చెందినట్టు వైద్యులు నిర్ధారించారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఎయిర్‌పోర్టు సీఐ బీఎండీ ప్రసాద్ పర్యవేక్షణలో ఎస్ఐ మోహనరావు దర్యాప్తు చేట్టారు.

ఆదివాసీ దినోత్సవ దృశ్యమాలిక





పాడేరులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి, జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర, పాడేరు ఐటీడీఏ పీవో అభిషేక్



జోలాపుట్టు మాజీ సర్పంచ్ వంతాల రామస్వామిని సన్మానిస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్, ఐటీడీఏ పీవో అభిషేక్ తదితరులు



మోదకొండమ్మ అమ్మవారికి పట్టువస్త్రాలు తీసుకువస్తున్న ఐటీడీఏ పీవో అభిషేక్



పాడేరులో విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శన



విద్యార్థినుల నృత్య రూపకం



పందిరిమామిడిలో నిర్వహిస్తున్న ర్యాలీలో పాల్గొన్న రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి, నేతలు